క్లుప్తంగా

ఎస్పీకి సన్మానం



ఎస్పీని సన్మానిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: నూతనంగా జిల్లా ఎస్పీగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఎస్పీ రోహిత్ రాజును మంగళవారం ఎస్ఆర్ ప్రైమ్ ఎడ్యుకేషన్ జోనల్ ఇన్‌చార్జ్ వై.సతీష్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజు తాను వరంగల్‌లో ఎస్ఆర్ కళాశాలలో చదువుకున్న జ్ఞాపకాలను సతీష్‌తో పంచుకున్నారు. ప్రిన్సిపాల్ అశోక్, వైస్ ప్రిన్సిపాల్ అండ్ అకాడమిక్ ఇన్‌చార్జ్ రాజేష్‌కన్న పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు జీవన భృతి కల్పించండి

కొత్తగూడెంఅర్బన్: మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని రద్దు చేయాలి.. లేదంటే ఆటో డ్రైవర్లకు జీవనభృతి కింద నెలకు రూ.15 వేలు ఇవ్వాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సూపర్ బజార్ సెంటర్‌లో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష శిబిరంలో నరేష్ మాట్లాడారు. ఉచిత బస్సు పథకం అమలు వలన ప్యాసింజర్ ఆటోలలో ఎవరూ ప్రయాణించడం లేదని, దీని వలన రోజుకు రెండువందలు కూడా రావడం లేదన్నారు. దీంతో ఆటో ఫైనాన్స్‌లు, ఇల్లు గడవడం కష్టంగా ఉందన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన

ఇల్లెందు: మూడు నెలలుగా వేతనాలు చెల్లించటం లేదంటూ ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు విధులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. మంగళవారం ఇఫ్టూ, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కమిషనర్ నవీన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, యాకుబ్ షావలీ, ఎస్ఏ నబీ, తాళ్లూరి కృష్ణ, కుమార్, రాంచందర్, వెంకన్న, భారతి, ఉమా, వేణు, సంజీవ్, సంధ్య, మైబురెడ్డి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ దుస్తుల పంపిణీ



స్పోర్ట్స్ యూనిఫాంతో విద్యార్థులు

జూలూరుపాడు: సువిధ వికాస్ ట్రస్ట్, అప్పుగుర్తి వారు పాపకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్పోర్ట్స్ దుస్తులను అందజేశారు. పాపకొల్లు హైస్కూల్ హెచ్ఎం ఎస్కే మీరా సాహెబ్, ట్రస్ట్ నిర్వాహకులు వెంకటేశ్వర్లు, మన్మధరావు, పీడీ పద్మావతి, ఉపాధ్యాయులు ఎస్.కృష్ణ, హరిలాల్, ఆర్.నాగేశ్వరరావు, పురుషోత్తం, బి.నాగేశ్వరరావు, విజయలక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం

పాల్వంచ: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ టెన్త్, ఇంటర్ 2023–24 విద్యా సంవత్సరానికి చివరి విడత ప్రవేశాలకు జనవరి 11వ తేదీ వరకు అవకాశం ఉందని స్టార్ చిల్డ్రన్ హైస్కూల్ ఏఐ కోఆర్డినేటర్ జి.భాస్కర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వివరాలకు 9866806532 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

13 నుంచి ఆటల పోటీలు

ఇల్లెందురూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా కొమరారం గ్రామంలో ఈనెల 13,14 తేదీలలో కొమరారం ఉమ్మడి పంచాయతీ స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు పర్శిక రవి, నాయకులు మోతీలాల్, జోగ కృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. కబడ్డీ, వాలీబాల్, మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తామని చెప్పారు.

14 నుంచి వాలీబాల్..

ఇల్లెందురూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ నెల 14, 15 తేదీలలో బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ కొల్లాపురం గ్రామంలో 47వ మూడు జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు యంగ్‌స్టార్ యూత్ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులకు వారు మాట్లాడారు.. వరుసగా 47 ఏళ్లుగా గ్రామంలో యంగ్‌స్టార్ యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పోటీలలో పాల్గొనదలిచిన జట్లు ఎంట్రీలను నమోదు చేసుకోవాలన్నారు. ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ రూ.16వేలు, తృతీయ రూ.12వేలు, కన్సొలేషన్ బహుమతిగ రూ.8వేలను జ్ఞాపికలు అందిస్తామన్నారు. అంతేకాకుండా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 7702347573 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

చెక్‌డ్యామ్‌కు మోక్షం ఎప్పుడో?

- కిన్నెరసానిలో రంగాపురం వద్ద కొట్టుకుపోయిన నిర్మాణం
- 2021లో రూ.12.74 కోట్ల ఖర్చు
- ఆరు నెలల క్రితం వరదలతో తీరని నష్టం
- ఇకనైనా పునరుద్ధరించాలని రైతుల విన్నపం



రంగాపురం వద్ద కిన్నెరసాని వాగులో కొట్టుకపోయిన చెక్‌డ్యామ్ (ఫైల్)

పాల్వంచరూరల్: భూగర్భజలాల పెంపు కోసం రూ.కోట్ల వ్యయం చేసి నిర్మించిన చెక్‌డ్యామ్ ఆరు నెలల క్రితం వరదలకు కొట్టుకపోయింది. ఈ చెక్‌డ్యామ్‌కు మళ్లీ ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని రైతులు ఎదురుచూస్తున్నారు. మండల పరిధిలో రంగాపురం సమీపంలోని కిన్నెరసాని వాగులో 2021లో గత ప్రభుత్వం రూ.12.74కోట్ల మంజూరు చేయగా చెక్‌డ్యామ్ నిర్మించారు. తద్వారా రంగాపురం, నాగారంకాలనీ, నాగారం గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూములకు సాగునీరు లభించేంది. భూగర్భ జలాలు కూడా పెరగడంతో సాగు, తాగు అవసరాలకు ఉపయోగపడింది. రైతులు వానాకాలం, యాసంగి రెండు పంటలు పండించుకునేవారు.

భారీ వరదతో...

గతేడాది జూలై 28న కురిసిన వర్షానికి కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి భారీగా వరద చేరింది. దీంతో ఒక్కసారిగా గేట్లు ఎత్తివేయడం వలన వరద ఉధృతి కారణంగా వాగులోని చెక్‌డ్యామ్ కొట్టుకుపోయింది. ఫలితంగా వానాకాలంలో సాగుకు అంతంత మాత్రంగానే నీరు లభించగా.. ఇప్పుడు యాసంగిలో ఇబ్బందులు తప్పేలా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిశీలనతోనే సరి...

కిన్నెరసాని వాగులో కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్‌ను నాడు వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు పరిశీలించారు. అప్పటి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ సీనియర్ నేత హన్మంతరావు తదితరులు పరిశీలింగా, వెంటనే పునరుద్ధరించాలని రైతులు కోరారు. ఇంతలోనే ప్రభుత్వం మారగా... నాటి సీఎల్పీ నేత భట్టి డిప్యూటీ సీఎంగా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈ మేరకు వారు స్పందించి చెక్‌డ్యాంను పునరుద్ధరించడమే కాక అప్పుడు జరిగిన పంట నష్టానికి పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

చెక్‌డ్యామ్‌ను పునరుద్ధరించాలి..



వరద కారణంగా ఆరు నెలల క్రితం కిన్నెరసాని వాగులో కొట్టుకపోయిన చెక్‌డ్యామ్‌ను పునరుద్ధరించాలి. చెక్‌డ్యామ్ నిర్మాణంతో భూగర్భజలాలు పెరిగాయి. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి. లేదంటే పంటలు పండే పరిస్థితి లేదు.

– తారాచంద్, రైతు, రంగాపురం

నష్ట పరిహారం చెల్లించాలి..



వరదల కారణంగా కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో వరద పెరిగి చెక్‌డ్యామ్‌తోపాటు నా పంట పొలం, మామిడి చెట్లు కొట్టుకుపోయాయి. అధికారులు పరిహారం ఇస్తానన్నారు. ఇప్పుడు స్పందించడం లేదు. ఇకనైనా అధికారులు దృష్టి సారించాలి.

– తేజావత్ కోటయ్య, రైతు

ప్రతిపాదనలు పంపాం..



రంగాపురం వద్ద వరదల కారణంగా కిన్నెరసాని వాగులో కొట్టుకపోయిన చెక్‌డ్యామ్ పునరుద్ధరణ కోసం ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాం. నిధులు విడుదల కాగానే నిర్మాణానికి చర్యలు చేపడుతాం.

– బి.అర్జున్, ఈఈ, జలవనరుల శాఖ

పాత పెన్షన్ విధానం అమలు చేయండి



దీక్ష చేపట్టిన రైల్వే ఉద్యోగులు

కొత్తగూడెంఅర్బన్: సమాజంలో గౌరవంగా జీవించడానికి పాత పెన్షన్ విధానమే అమలు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ బీడీసీఆర్ బ్రాంచ్ సెక్రెటరీ జేమ్స్‌పాల్ అన్నారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో ఓల్డ్ పెన్షన్ స్కీమ్ సాధనకై, కొత్తగూడెం రైల్వే స్టేషన్ ఆవరణలో మంగళవారం రీలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జేమ్స్‌పాల్ మాట్లాడుతూ.. నేషన్ పెన్షన్ స్కీం పేరుతో ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. పాత పెన్షన్ ప్రతి ఒక్క కార్మికుడి హక్కు అన్నారు. కార్యక్రమంలో పి.రవి, జలీల్, త్యాగరాజు, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

జూలూరుపాడు: నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన చలో పార్లమెంట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం జూలూరుపాడులో జరిగిన ఎస్ఎఫ్ఐ మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానం, అందరికీ ఉచిత విద్య, ఉపాధి కల్పించాలని, తెలంగాణ రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చాలన్నారు. ఈనెల 12న ఎస్ఎఫ్ఐతోపాటు మరో 16 విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చలో పార్లమెంట్ ముట్టడికి పిలుపునివ్వడం జరిగిందన్నారు. కేంద్రం ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 3 శాతం నిధులు కేటాయించడం దారుణమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బోడా అభిమిత్ర, మండల కార్యదర్శి జెమ్మి యశ్వంత్, పెరుమాళ్ల పవన్, వెంకట్, నాగరాజు, రాధాకృష్ణ, ప్రసాద్, శివ పాల్గొన్నారు.


శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

టేకులపల్లి: ఎవరైనా సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే రౌడీషీట్ నమోదు చేస్తామని టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి టేకులపల్లి ఎస్ఐ రమణారెడ్డితో కలిసి హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లి సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తడికలపూడి రోడ్‌లో జరిగిన దాడి ఘటనలకు సంబంధించి బాధ్యులైన వారిని రూ.2 లక్షల సొంత పూచీకత్తుపై ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేసినట్లు తెలిపారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ తదితర సోషల్ మీడియాలలో రాజకీయంగా, వ్యక్తిగతంగా దూషించడం, రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు, సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు.


పూజారులను ఆదుకోవాలి



నినాదాలు చేస్తున్న పూజారులు

పాల్వంచ: ప్రభుత్వం దేవాలయాల్లో పనిచేసే పూజారులను ఆదుకోవాలని జగదాంబ మేడారం భద్రకాళి పూజారుల సంఘం జాతీయ అధ్యక్షుడు టి.రాములు అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని కరకవాగులో శ్రీ జగదాంబ దేవి ఆలయంలో జగదాంబ మేడారం భద్రకాళి పూజారుల సంఘం 5వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అనేక చిన్న దేవాలయాల్లో పేద పూజారులు పనిచేస్తున్నారని, వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వ పథకాల్లో స్థానం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జి.కిశోర్, కె.శివకుమార్, పద్మ, ఈశ్వరమ్మ, లక్ష్మి, కళావతి, సునీత, కవిత, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయండి



ఏఓ ఘన్యాకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

జూలూరుపాడు: స్థానిక ఉప మార్కెట్ యార్డును శాశ్వత వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం అఖిలపక్ష నాయకుడు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కలెక్టరేట్ అడ్మిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఓ) ఘన్యా, జిల్లా వ్యవసాయ అధికారి అభిమన్యుడుల, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులకు అఖిలపక్ష నాయకులు కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుత ఉప మార్కెట్ యార్డును ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి విడగొట్టి శాశ్వత వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఉప మార్కెట్ యార్డు ద్వారా ప్రతి ఏడాది సెస్ రూపంలో ఆదాయం వస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించడంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ విఫలమైందన్నారు. సరైన సౌకర్యాలు లేక రైతులు, హమాలీలు అవస్థలు పడుతున్నారన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డు కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలంలో యార్డు నిర్మించి, అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గుండెపిన్ని వెంకటేశ్వర్లు, బానోత్ ధర్మా, యాసా నరేష్, వల్లోజి రమేష్, చలమల గోవిందు, తంబర్ల నరసింహారావు, మేస్త్రీలు రామస్వామి, బోడయ్య, జాన్, బాబురావు, సుందర్‌రావు, మోపు శ్రీను, మందా లక్ష్మణ్, దేవదానం, పండు పాల్గొన్నారు.

నేడు రుద్రహోమం

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో బుధవారం 9 గంటల నుంచి మధ్యాహ్నం1 గంట వరకు యాగశాలలో రుద్రహోమం పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.1,516 చెల్లించి తమ గోత్ర నామములను నమోదు చేసుకోవాలని కోరారు.

విశ్వశాంతి కళ్యాణానికి ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: వచ్చేనెల 24వ తేదీన కొత్తగూడెంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డు సమీపంలోని కార్తీకవనం నర్సరీలో విశ్వశాంతి కల్యాణ మహోత్సవం, అష్టలక్ష్మి యాగం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఎస్పీ రోహిత్‌రాజు, సింగరేణి సీఎండీ బలరామ్‌లకు శ్రీచండీ సర్వజ్ఞపీఠం వ్యవస్థాపకులు దండిబోట్ల రామాంజనకుమార శర్మ మంగళవారం ఆహ్వాన పత్రం అందజేశారు.

ఆశా కార్యకర్తల సమావేశం

సుజాతనగర్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ బి.రమేష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందే అవకాశమున్నందున గ్రామాలలో డ్రై డే వాటరింగ్ చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాల్వంచరూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో మూడు సంవత్సరాల బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు ఈనెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రెగ్యులర్/ఓపెన్ ఇంటర్, పాల్‌టెక్నిక్, ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 7382929727 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సహకార సంఘాల నూతన కమిటీ ఎన్నిక

జూలూరుపాడు: నాయీ బ్రాహ్మణ సహకార సంఘాల నూతన కమిటీ కార్యవర్గం ఎన్నిక మంగళవారం జూలూరుపాడులో జరిగింది. స్థానిక ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌లో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారులు విజయలక్ష్మి, లక్ష్మణ్, సంఘం జిల్లా అధ్యక్షుడు కడియాల సత్యనారాయణ ఆధ్వర్యంలో 12 సహకార సంఘాలకు నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. కుదురుపాక నిర్మల, మాడుగుల నాగరాజు, మణికుమార్, ఆనందరావు, పుల్లయ్య, రమేష్, నరేష్, హరీష్, సురేష్, శేషాద్రి మధు, నాగేశ్వరరావు, ఉమ, శ్రీలత, జ్యోతి, రమాదేవి, పాల్గొన్నారు.

ఆర్డీఓ విచారణ

చుంచుపల్లి: ప్రశాంత్ నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనం పక్కన ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తగూడెం ఆర్డీఓ శిరీష మంగళవారం పరిశీలించారు. అక్కడున్న గుడిసెవాసులను స్థల ఆక్రమణ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సీఎండీకి ఎమ్మెల్యే శుభాకాంక్షలు



బలరామ్‌కు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి కొత్తగూడెం వచ్చిన సందర్భంగా మంగళవారం ఎన్.బలరామ్‌కు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... నూతన భూగర్భ గనుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించి కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని, బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి సింగరేణి ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీగా అధికార యంత్రాంగానికి సంపూర్ణ సహకారాలు అందిస్తామని కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా కృషి చేద్దామని పేర్కొన్నారు. కార్మికుల సొంతింటి కలను నెరవేర్చాలని కోరారు. కూనంనేనితోపాటు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, కొత్తగూడెం బ్రాంచ్ నాయకులు వంగా వెంకట్, రమణమూర్తి సీఎండీకి శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి..

కొత్తగూడెంటౌన్: క్రీడాలను ప్రోత్సహిస్తే వారు రాణిస్తారని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం రామవరం మేషన్ కాలనీలోని గ్రౌండ్‌లో జరిగిన గెట్ టూ గెథర్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ క్రికెట్ మ్యాచ్‌లో విజేత, రన్నర్ జట్లకు బహుమతులను అందజేశారు. మాట్లాడుతూ.. క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారాలను అందిస్తానన్నారు.

రైల్వే కార్మికులకు మద్దతు..

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్‌లో రైల్వే కార్మిక యూనియన్ (ఏసీఆర్ఎంయూ) వారి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన కొత్త పెన్షన్ విధానం రద్దు చేయాలని రెండో రోజై మంగళవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షా శిబిరాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు సందర్శించి కార్మికుల దీక్షకు మద్దతు తెలిపారు. ఎస్‌కె.సాబీర్‌పాషా, ఎస్‌కే.ఖాజాబాబా, కోలా వెంకటేశ్వర్లు, బస్వారి పుల్లయ్య, ఓం కుమార్, పవన్, రామారావు, రవి రాజ్, నవీన్, రవితేజ, నాగరాజు, వై గోపాలరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పాల్వంచ: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కార్మికులకు యూనిఫాం పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. అనంతరం కూనంనేనిని సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల కృషి విలువైందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎ.స్వామి, డీఈ మురళీ, టీపీఓ సత్యనారాయణ, ఏఐటీయూసీ కార్మిక సంఘం, సీపీఐ, కాంగ్రెస్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సమస్యలు పరిష్కరిస్తా

మున్నూరు కాపుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం స్థానిక బాపూజీ నగర్‌లో సంఘం ఆధ్వర్యంలో కూనంనేనికి సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడారు. ఎన్‌పీ నాయుడు, మల్లేష్, బోస్‌బాబు, సాయిరాం, పెంటయ్య పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పాల్వంచరూరల్: పలుగ్రామపంచాయతీల్లో బుధవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పర్యటిస్తారని క్యాంప్ కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగదేవిగుప్పలో ఉదయం 9.30 గంటలకు, దంతలబోరులో 10 గంటలకు, దంతలబోరు హరిజనవాడలో 11 గంటలకు, సంగం గ్రామంలో 11.30 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయాలను ప్రారంభిస్తారు. 12.30కు నారాయణరావుపేట ఎస్సీకాలనీ, 3గంటలకు నారాయణరావుపేట, 3.30 గంటలకు నారాయణరావుపేట ఎస్సీకాలనీ 2, రేపల్లెవాడలో 4గంటలకు, బొజ్జాయి తండాలో 4.30 గంటలకు, నాగారంలో 5గంటలకు, రంగాపురంలో 5.30 గంటలకు, నాగారం కాలనీలో 6గంటలకు పర్యటించనున్నారు. స్థానికులు, పార్టీ కార్యకర్తలు ఈ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

సంస్థ మనుగడ కోసం పోరాడుతాం..



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

ఇల్లెందు: సింగరేణి సంస్థ మనుగడ కోసం కార్మికుల సంక్షేమం కోసం నూతన బావుల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తామని, కార్మికులు అప్పగించిన బాధ్యతను విస్మరించబోమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం ఇల్లెందులోని విఠల్‌రావు భవన్‌లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ స్థాయి కౌన్సిల్ సమావేశం జరిగింది. సీతారామయ్య మాట్లాడుతూ.. సింగరేణి ఎన్నికల్లో కార్మికులు గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీకి అవకాశం కల్పించటం అంటే ఇప్పటి వరకు అధికారంలో ఉన్న టీబీజీకేఎస్ కార్మికుల సమస్యలను విస్మరించిందని రుజువు అయిందన్నారు. సింగరేణి మనుగడ నిలబడాలంటే నూతన బావులు ఏర్పాటు చేయాలని, ఆ దిశగా తమ సంఘం ప్రభుత్వంతో పోరాడుతుందన్నారు. బొగ్గు బావుల వేలం వేయించే పద్ధతికి స్వస్తి పలికేలా యాజమాన్యం మీద ఒత్తిడి పెంచుతామని తెలిపారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య, బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్, రాజారామ్, కె.వెంకటేశ్వర్లు, గుగులోతు కృష్ణ, సుందర్, దేవరకొండ శంకర్, శంకర్, మంచాల వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాస్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు రేడియం స్టిక్కర్లు



టేకులపల్లిలో ట్రాక్టర్‌కు రేడియం స్టిక్కర్ అంటిస్తున్న సీఐ, ఎస్ఐ

టేకులపల్లి: రాత్రి వేళలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ రమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాక్టర్లు, ట్రాలీల యజమానులను వాహనాలతో పాటు పిలిపించి ఆ వాహనాలకు రేడియం స్టిక్కర్లను ఉచితంగా అందజేశారు. దీనివల్ల రాత్రి సమయంలో ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు. ప్రమాదాల నివారణలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు.

జూలూరుపాడు: ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కొత్తగూడెం డీఎస్పీ ఎస్కే అబ్దుల్ రెహమాన్ అన్నారు. మంగళవారం గుండెపుడి ఆర్కే ఫంక్షన్ హాల్‌లో వెంగన్నపాలెం, జూలూరుపాడు, గుండెపుడి, పాపకొల్లు గ్రామాలకు చెందిన ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలను ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లకు ఆయన వివరించారు. ట్రాలీలు, ట్రాక్టర్ల వెనక, ముందు భాగాల్లో రేడియం స్టిక్కర్లు అతికించడం వల్ల రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరగకుండా ఉంటాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాలీ, ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటించకుండా పోలీసులకు పట్టుబడితే జరిమానా విధించడంతోపాటు, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సుమారు 25 ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటించారు.

సింగరేణి మెడికల్ బోర్డ్ నిర్వహించండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల కారణంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డ్‌ను వెంటనే నిర్వహించాలని సీఎండీ బలరామ్‌కు తెలంగాణ రీజినల్ సింగరేణి కార్మిక సంఘం సెంట్రల్ అధ్యక్షుడు కటుకూరి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. హైయర్ సెంటర్ రిఫరల్‌కు పంపించిన కార్మికులు నాలుగు నెలలుగా వేతనాలు కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని వెంటనే మెడికల్ బోర్డ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

ఫాతిమా జీవితాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి



మాట్లాడుతున్న యాకూబ్‌పాషా

కొత్తగూడెంఅర్బన్: భారతదేశపు మొట్టమొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జీవితాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా ప్రభుత్వాన్ని కోరారు. ఫాతిమాషేక్ 193వ జయంతిని మంగళవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని మండల ప్రజా పరిషత్ ఉర్దూ మీడియం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా 20 ఏళ్లుగా పని చేస్తున్న షాజియా తబసుంను ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. యాకూబ్ పాషా మాట్లాడుతూ.. ముస్లింలకు భారతదేశంలో ఆధునిక విద్య అందించడానికి పునాదులు వేసి, సంఘ సంస్కర్తగా ఫాతిమా షేక్ పని చేసి, బేటీ పడావో, బేటి బచావోకు ఆద్యురాలుగా నిలిచారని కొనియాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఉర్దూ పాఠశాలల అభివృద్ధి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హుస్సేన్ ఖాన్, షకీల్, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.